# షర్టు

**మునుమకె. మూర్తి**

"**భరత మాత** కన్నీరు తుడవటం కష్టం. . .'' శ్రీలక్ష్మి చదివింది.

"ఆదేమిటన్నయ్యా అట్లా రాశావు? ఇంకా రాసేదేమైనా ఉందా? అది అంతేనా?'' ఆశ్చర్యంగా అడిగింది. మనస్ఫూర్తిగా నవ్వాను. జవాబు చెప్ప లేయాను. కానీ అదీ చిన్నపైజ రచయిత్రి. పది పన్నెండు కథలు, నాలుగైదు కవితలు వారపత్రికలకు పంపితే అచ్చయ్యాయి. మగవారి నిరంకుశత్వాన్ని, అనాదిగా స్త్రీలకు జరుగుతున్న అన్యాయాల్ని నాటిగా తెలుపుతూ కొన్ని కథలు, రాజకీయవాదుల కుత్సితాన్ని దరిద్ర నారాయణుల యథార్థ గాథల్ని వర్ణిస్తూ మరికొన్ని కథలు రాసింది. నాతో వాదించి నాలుగు పాయింట్లు లాగి, వాటికి రంగులు పులిమి కొన్ని పామెతల్ని, మరికొన్ని సిమిలీలను జోడించి అందమైన కథల్ని తయారుచేసి పత్రికలకు పంపుతుంది.

"ఇన్ని కథల్లో నా ఆయిడియాలని, నా మాటల్ని, ఆ మాటకొస్తే నా వాక్యాలనే వాడేసుకొన్నావు. ఒక్క కథ నాకు అంకితం ఇవ్వవే'' అని దాన్ని ఏడిపిస్తుంటాను. అది నాతో గట్టిగా వాదించిందంటే ఒక కథ పుట్టిందన్న మాటే.

నేను వినోదాలని స్నేకార్డ్స మీద కుదిర్చి రాసి కాస్త డబ్బు సంపాదిస్తుంటాను. అదుగో—ఆ వినోదాల్లో ఒకటే ఇది. సమ్మె చేసే వాళ్ళ నాయకుడు సాయంత్రం వస్తాడు. రెండు రోజుల తరవాత సమ్మెట. నేను చాలా కాలం బతకాలి. చాలా కాలం బతకాలంటే సమ్మెలు, ఉద్యమాలు కలకాలం వర్ధిల్లాలి. నేనెందుకు చాలా కాలం బతకాలంటే మా రచయిత్రి చెల్లెలు శ్రీలక్ష్మి పెళ్ళి చెయ్యాలి. ఇంకో నాలుగేళ్ళు కాళ్ళు, చేతులు కూడదీసుకుని మహాలక్ష్మి పెళ్ళి చెయ్యాలి. మళ్ళీ ఊపిరి గట్టిగా తీసుకొని వెంకటలక్ష్మి పెళ్ళి చెయ్యాలి. ఆరేళ్ళ తమ్ముడు శ్రీపతిని చదివించాలి. మా నాన్న శ్రీమన్నారాయణ గారు క్షయ వ్యాధికి బలైపోయారు. మా అమ్మ సుబ్బలక్ష్మి సగటు భారత నారీమణి. మర్రినీడన పెరిగే వెర్రి తీగ మా అమ్మ వట్టి అమ్మ. వండి పెట్టడం తప్ప మరేం తెలియని పిచ్చి తల్లి. ఇంతకీ నా పేరు చెప్పలేదు కదూ! నా పేరు శ్రీనివాసరావు. ఇన్ని శ్రీలు, ఇన్ని లక్ష్ములు ఉన్న మా రెండు గదుల పెంకుటింటి పేరు "లక్ష్మి నిలయ్''. ఇంటి పేరు, పిల్లల పేర్లు శ్రీ అని, లక్ష్మి అని పెట్టే ఆ శ్రీదేవిని ఇంట్లో కట్టేద్దామను కున్నారు మా నాన్నగారు. ప్చ్!ఆ దేవి కరుణించలేదు. పోయేదాకా కనకధారా స్తోత్రం, లక్ష్మి అష్టోత్తరం విడవ కుండా చదివారు.

ప్చ్! దయ కలగలేదు. పిల్లల కంత తిండైనా మిగులుతుంది. కండలు పెంచితే ఒరిగే దేముందని సోమవారం శివుడి పేరిట, గురువారం సాయిబాబా పేరిట, శుక్రవారం అమ్మవారి పేరిట, శనివారం వెంకటేశ్వరస్వామి పేరిట పాక్షిక ఉపవాసం చేసేవారు. అంటే ఒక పూట తినేవారు. 'ఆదివారం కూడా సూర్యోపాసన చేస్తున్నాను— ఉపోషం ఉంటా' నన్నారు. అమ్మే ఏడ్చి మాన్పించింది. ఉపవాసాల ఫలితం పూరికే పోతుందా? కండలు పెరుగుతాయేమోనని భయపడ్డ మా నాన్నకు ఉన్న కాస్త కండనీ తినేసే క్షయ వ్యాధి పట్టుకుంది.

"ఈ సిరి నీకూ, పిల్లలకూ అంటించ కుండా పోవటమే మహా ప్రసాదం, సుబ్బులూ'' అనేవారు. పోయే ముందే 'సుబ్బులూ' అని పిలవటం మొదలు పెట్టారు. అప్పటి దాకా 'సుబ్బలక్ష్మి' అని పూర్తి పేరు పెట్టి పిలిచేవారు. ఉలకని, పలకని లక్ష్మిని పేరులో కలవటం ఎందుకనుకున్నారేమో! చివరలోకి 'సుబ్బులూ' అని పిలిచేవారు. ఆయన పోయారు.

'ఇలనెగయు ధూళి చులకన
చులకన మరి తల్లిలేని సుతుడు
కుమారా!'

కవి దృష్టిలో తల్లి లేకపోతేనే చులకనేమో గాని నా దృష్టిలో తండ్రి లేకపోతేనే చులకన. అందరం చులకనైపోయాము. సర్వాజీలు, సింగులు, మార్వాడీలు తట్టా, బుట్టా, ఇల్లా లాక్కుపోయారు. అంత అప్పు ఎందుకయిందని మా నాన్నను తిట్టేరు గనక! ఆ పని మాత్రం చెయ్యకండి—ప్లీజ్! "ఆర్నెల్ల కోసారి జీతాలిచ్చే అతి గౌరవప్రదమైన ఉద్యోగం ఏది?'' క్విజమాస్టర్‌గా నన్ను నియమిస్తే నా మొదటి ప్రశ్న ఇదే! ఇరు పక్షాలకూ జవాబు తెలియదేమో! నేనే జవాబు చెపుతాను. బడి పంతులు ఉద్యోగం! మా నాన్నగారు పోయేదాకా వెలగబెట్టిన ఉద్యోగం అదే. సాయంత్రాలు ట్యూషన్లు చెప్పేవారు. తొమ్మిదిన్నరదాకా కిరాణా కొట్లలో పద్దులు రాసేవారు. 'పంతులు, పంతులు' అంటూ బ్రహ్మరథం పట్టేవారు. కానీ పైసలే రాలేవి కావు. పంతులుగారు బతుకు మెంతుల రుచి అయింది. ఏ మాట కా మాటే చెప్పుకోవాలి. పోయినప్పుడు మాత్రం మా నాన్నకు మహారాజయోగం పట్టింది. ఏ స్థానిక రాజకీయ నాయకుడి అంతిమయాత్రకీ అంత మంది వచ్చి ఉండరు. పాత, కొత్త విద్యార్థులు, అధ్యాపకులు, అధ్యాపకేతర బృందం, కిరాణా కొట్ల ఓనర్, కుటుంబ సభ్యులు, కొట్ల ఖాతాదార్లు, అప్పిచ్చినవాళ్ళు, ట్యూషన్ పిల్లలు, ఇంటి చుట్టుపక్కల వాళ్ళు... అబ్బో! ఎంత మందో!

వందలాది మంది నన్ను ఓదారుస్తుంటే అంత దుఃఖంలోనూ ఏదో థ్రిల్ ఫీలయ్యాను. అర్థ బలం లేక పోయినా అంగబలం బోలెడు ఉంది కదా అని సంతోషించాను. రుద్రభూమి చేరేసరికి పదిమంది ఉన్నారు. 'అరె, అందరూ జారుకున్నారే' అని ఆశ్చర్య పోయి ఇల్లు చేరే లోగా నేనొక్కన్నే మిగిలాను. నిజంగా ఒక్కన్నే ఉంటే అసలు సమస్యే లేదు. అమ్మ, ముగ్గురు చెల్లెళ్ళు, తమ్ముడు ఉన్నారు. చాలాకాలం ఉంటారు. చెల్లెళ్ళు పెళ్ళిళ్ళు అయ్యే దాకాను, తమ్ముడు చదువయ్యేదాకాను, అమ్మ తనువు చాలించేదాకాను ఉంటారు.

ఇరవయ్యేళ్ళలో అరవయ్యేళ్ళ అనుభవంతో బి. ఎ. డిగ్రీతో రోడ్ను మీద పడ్డాను. చచ్చి ఏ లోకాల్లో ఉన్నారో మా నాన్న—ఆయన పాత విద్యార్థి పాత కాలం వాడు ఒకాయన తగిలాడు, కాస్త లేటుగానే! "అయ్యో! ఎంత మాట! మీ నాన్నగారివల్లే నే నింతవాణ్నయ్యాను! అయ్యో! మాస్టారు గారు పోయారా!'' అని బాధ పడ్డాడు. మొసలి కన్నీటి కొలనులో స్నానం చెయ్యటం అలవాటైన నాకు మరో మనక తప్పదు అనుకున్నాను. కానీ అయనవి వట్టి మాటలు కావు. గట్టి మేలే చేశాడు. ఆయన ఆఫీసులో ఎల్డీసీ ఉద్యోగం ఇచ్చాడు. పులి కడుపున పిల్లి పుట్టదుగా! నేనూ మా నాన్న కొడుకునే! సాయంత్రాలు ప్రింటింగ్ ప్రెస్సులో పని చేసి, రాత్రిళ్ళు సమ్మెలకు సంబంధించిన నినాదాలు వ్రాసి బోర్డుల కెక్కించి రాత్రి పన్నెండు గంటలకు పడుకుంటాను. పొద్దున్నే అయిదు గంటలకి లేచి ఆఫీసుకెళ్ళేదాకా నినాదాలే రాస్తుంటాను. వాటిని బొంగు కర్రలకి కట్టి తయారుగా ఉంచటం మా చెల్లాయిలు, తమ్ముడి పని.

నేను మూడు పద్ధతుల్లో సంపాదించినా, శ్రీలక్ష్మి అడపా దడపా కథలు రాసి సంపాదించినా రెండు పూట్ల కడుపు నిండా తినలేకపోతున్నాం. బట్టల కొట్లలో ఇరవై శాతం రిబేటు ఇచ్చినప్పుడు కూడా బట్టలు కొనను. అందులో అప్పుడప్పుడు నలభై శాతం రిబేటు కూడా ఇస్తారు. అప్పుడే కొంటాను. కొద్దిగా పాత స్టాకు. కాస్త పాడయి కూడా ఉండవచ్చు. నాకు తెలుసు ఆ బట్టలు కొనకూడదని, అవి ఎక్కువ కాలం మన్నవని. నిజాని కది అదా కాదు. శుద్ధ దండగ. పెట్టె కొట్టుడు బట్టలు కనక, నీళ్ళలో వెయ్యగానే జాళ్ళు పడిపోవటం, మడతల్లో చిరగటం, అంచులు పెట్లిపోవటం, ఒకే రంగు నాలుగు రంగులుగా కనపడటం మొదలైన లక్షణాలన్నీ నలభై, యాభై శాతం రిబేటులో ఉంటాయి. లేకపోతే వాళ్ళేం బుద్ధిహీనులా సగం ధరకు అమ్మడానికి!

"మీ ఒంటికి కత్తులున్నాయిరా! నెలా రెన్నెల్లలో అలుకు గుడ్డలు చేసేస్తారు. వాడేమో రెక్కలు ముక్కలు చేసుకొని మీకు ధార పోస్తాడు. మీ కేమో విలువ తెలియదు. పీతాంబరా న్నయినా క్షణంలో పిప్పి చేస్తారు. గిరవాటు కొడతారు. ఇంట్లోకి, వీధి లోకి అదే గుడ్డ'' అని అమ్మ వాళ్ళని తిడుతుంటే చాలా గిల్టీగా ఉంటుంది.

నే నెలాంటి పీతాంబరాలు కొంటానో నాకే తెలుసు. రంగులు అందంగా ఉంటాయి. ప్రింట్లు మరీ అందంగా ఉంటాయి. బట్ట మాత్రం నాసి రకం. వర్తకులకు డబ్బు చేసుకోవటం తెలుసు. నాకు మభ్య పెట్టడం తెలుసు. అమ్మకేం ఘనమైన చీరలు కొన్నాననీ? ఆమె చీరకూ అంతే అయుష్షు. చిరుగులు కనిపించకుండా జాగ్రత్తగా కుట్టు కుంటుంది. లేమివి దాచడానికి ఆమె చేసే వృథా ప్రయత్నం చూస్తే నాకు నవ్వు వస్తుంది. ఖరీదైన బట్టలు కొంటే కాస్త ఎక్కువ రోజులు మన్నుతాయని నాకు తెలుసు. కాని, ఇంత మందికి ఖరీదైనవి కొనడానికి డబ్బేది?

శ్రీలక్ష్మి రాసిన కథ అచ్చయిందట. హుషారుగా చెప్పింది. దానికి తన పేరు వారపత్రికలో చూసుకొనే కోరికే లేదు. పత్రికవాళ్ళు పంపే చెక్కు కోసం వెయ్యి కళ్ళతో ఎదురు చూస్తుంటుంది. చెక్కు తీసుకున్న రోజు దాని మొహం వెలిగి పోతుంటుంది.

“అన్నయ్యా! నీ కో మంచి వార్త చెప్పాలిరా! నువ్వు చాలా సంతోషిస్తావు.”

“కట్నం వద్దనే బావమరిది వస్తున్నాడా, అమ్మా!”

“కాదురా! అల్లాంటిదేం కాదు. అసలు పెళ్ళి గొడవ కానే కాదు. చెప్పనా. . .”

“అయితే నీకూ ఒక మంచి వార్త— ముందు నేనే చెబుతాను!”

“కట్నం వద్దనే బావమరిది వస్తున్నాడా, అన్నాయ్?”

“కాదే! అల్లాంటిదేం కాదు. అసలు పెళ్ళి గొడవ కానే కాదు. చెప్పనా. . .”

“అయితే నేనే ముందు చెబుతా.”

“కాదు—నేనే ముందు చెబుతా.”

“నేను చిన్నదాన్ని. నే చెబుతా.”

“నేను పెద్దవాణ్ణి. నేనే చెప్తా.”

“కాదు, నేను.”

“అవును—నేను.”

“అయితే ఆగు—ఇద్దరం మంచి వార్తల్ని పేపర్ల మీద రాసి మార్చు కుందాం. అప్పుడు ఎవరు ముందన్న ప్రసక్తి రాదు.”

“సరే!”

కాగితాలు మార్చుకున్నాము. ఇద్దరం తెల్లబోయాము.

“అన్నయ్యా! పత్రికలవాళ్ళు పంపిన డబ్బులో నీకు పాలిస్టర్ షర్టు కొన్నాను.” మా ఇద్దరి కళ్ళు చెమర్చాయి. కలిమి లేని ఇంట్లో చెలిమి ఉంటుం దేమో!

‘భరతమాత కన్నీరు తుడవడం కష్టం’ అని నేను రాసింది అసంపూర్ణ నినాదమా? సంపూర్ణ నినాదమా? ఏం రాస్తే బావుంటుంది! రచయిత్రీ, కాస్త చెప్పమ్మా!” వాదానికి నాంది పలికాను.

“ఇది అసంపూర్ణ నినాదమే, అన్నయ్యా. అసలెలా ఉండాలి అంటే, ‘భరతమాత కన్నీరు తుడవటం కష్టం కాదు’ అని ఉండాలి. అందరం పూను కుంటే అదేం పెద్ద కష్టమైన పని కాదు. గుళ్ళని లింగాలతో సహా భోంచేయటం మానేసే ప్రతి వ్యక్తి తనని గురించి, తన వారిని గురించి మాత్రమే ఆలోచించుకోకుండా తనకి ఏమీ కాని ఎదుటి వ్యక్తి గురించి కాస్త ఆలోచించి, తనకు కలిగినదాంట్లో ఒక్క శాతమో, అర శాతమో వాడికోసం ఖర్చు పెట్టి బతికిస్తే ఈ దరిద్రం ఉండదు. స్వార్థమే ఇంత దారుణాలకి కారణం! ప్రతి మనిషికి అంతో, ఇంతో సామాజిక స్పృహ, చైతన్య భావాలు ఉండాలి. కాదంటావా? మనకంటే గొప్పవాళ్ళతో పోల్చుకొని బాధపడకుండా మనకంటే పేదవాళ్ళతో పోల్చుకొని వాళ్ళ కింత సాయపడాలిరా! అప్పుడే మన జీవితానికి సార్థకత ఉంటుంది. వాళ్ళేం రాయమన్నారో నాకు తెలియదు. కాని నేను చెప్పినట్టు రాస్తే బావుంటుంది. ‘భరతమాత కన్నీరు తుడవటం కష్టం కాదు’ అనే రాయి. మన మెప్పుడూ ఆశాభావంతోనే ఉండాలి. నిరాశకి తావిస్తే మనమేం సాధించలేం!”

నోరు తెరుచుకుని వింటున్నాను. ‘నా చెల్లెలు ఎంత ఎదిగి పోయింది! ఏవో అల్లిబిల్లి కథలు రాస్తోందను కున్నాను కాని దానికి సమాజం గురించి, దేశం గురించి ఇన్ని నిర్దిష్టమైన అభిప్రాయా లున్నాయనుకోలేదు. ఇంత నిస్వార్థంగా ఆలోచిస్తుందనుకోలేదు.’

ఎలాగో మాట పెగిలింది.

“లచ్చూ! కరెక్టుగా చెప్పావే. వాళ్ళు రాయమన్నది కూడా అదే. సరిగ్గా నువ్వు చెప్పినదే!! ‘భరతమాత కన్నీరు తుడవటం కష్టం కాదు’ అనే నేను వ్రాయాలి. ఆ కొస అక్షరాలు ‘కాదు’ అని రాసేలోపలే ఒక ఫ్రెండు వచ్చాడు. వాణ్ణి పంపించేసరికి నిద్ర ముంచుకొచ్చింది. పొద్దున్న ఆఫీసు


ఇంటి సినిమా యంత్రం

(SILENT MOVIE)

ధర రూ. 150



సినిమా ఫిలిం రీళ్ళు కూడా మా వద్ద లభ్యమౌతాయి. ప్రొజెక్టర్ మరియు సినిమా ఫిలిం ధరల జాబితాకు సమగ్ర కేటలాగ్ పుస్తకానికిగాను రూ. 2-50 కు పోస్టేజి స్టాంపులు పంపండి. ఇంగ్లీషులో మాత్రమే వ్రాయండి.

ఉత్పత్తి దారులు:

**FILM COMPANY**
(Established 1967)
Post Box No. 269
3, Thillaichidambara Nadar Street,
SIVAKASI-626123 Tamilnadu.



# ఇది మీకు చాలా ఉపయోగం

మీ నిత్యవ్యవహారాలకు ‘వ్యవహారదర్శిని’ అనే తెలుగుపుస్తకం మీకు చాలా ఉపయోగం. అందులో ఏదైనా ఆస్తి కొనేటపుడు తీసుకోవలసిన జాగ్రత్తలు, ఏదైనా ఉత్పత్తి, వ్యాపారం చేయాలంటే, దేనికె వరివద్ద ఎలా లైసెన్సు తీసుకోవాలి, వివిధ జాతుల వివాహ విడాకుల నిబంధనలు, స్త్రీపురుషుల ఆస్తి హక్కులు ఎవరితోనైనా ప్రమాదం రాబోతుంటే, పోలీసు రక్షణకు ఎవరికెలా వ్రాయాలి, ప్రభుత్వ ఉచిత యిండ్ల స్థలాలు పొందటానికి ఎవరికెలా ధరఖాస్తు వ్రాసి పంపుకోవాలి, నోట్లు దస్తావేజులు, ఒప్పందాల పత్రాలు, పిటీషన్లు, ఫిర్యాదులు, ఉత్తరాలు ఎలా వ్రాయాలి, వాటి వివిధ నమూనాలు, అనేక చట్టాల వివరాలు, ఇలాంటివెన్నో మీకుపయోగపడేలా, తెలిసేలా వ్రాయబడ్డాయి. 300 పేజీల పుస్తకం. ధర రూ॥ 12. పోష్టు ఖర్చు లదనం. దేశసేవ ప్రచురణలు, 2. ఇందిరానగరు, నెం గలరావునగరు టాంకు సమీపాన, హైదరాబాదు-890 కు ఉత్తరం వ్రాసి మీ ఉపయోగానికో పుస్తకం వి.పి. పోష్టుద్వారా వీలయినంత త్వరగా పొందండి




పని చూసుకోవాల్సి వచ్చింది. రాత్రి వచ్చి పూర్తి చేస్తాలే!''

శ్రీలక్ష్మి మాటలు నా మీద బాగా పని చేశాయి. నిజమే. ప్రతి మనిషికి సామాజిక స్పృహ, స్వార్థరహిత బుద్ధి చైతన్య భావాలు ఉండాలి. ఎదుటి వ్యక్తికి అంతో ఇంతో దానం చెయ్యాలి. వాళ్ళ దరిద్రాన్ని కడిగెయ్యడానికి ప్రయత్నించాలి. మనకంటే ఎక్కువ వాళ్ళతో పోల్చుకొని ఎగబాకటానికి ప్రయత్నించేకంటే మధ్య మెట్టుమీద ఉన్నవాళ్ళం మెట్టుకి కింద ఉన్నవాళ్ళకి కాస్తంత చేయూతనివ్వాలి. నా చేతనైన సాయం చెయ్యాలి. ఓటు వేసి చేతులు దులుపుకోవటం కాదు మనం చెయ్యాల్సిన పని—ఉత్సాహం ఉరకలు వేస్తోంది. పొంగి ప్రవహిస్తోంది. చిన్న కొలనై, చెరువై, నదిగా మారి ఉన్నట్టుండి కడలిరూపం దాల్చింది. ఆనందపు టలల మధ్య ఒక ఆకారం మసక మసగ్గా కనిపిస్తోంది. ఎవరబ్బా అరె! పోచయ్య అవును పోచయ్యే! స్పష్టంగా కనిపిస్తున్నాడు. చాలా కాలం నుంచి మా ఆఫీసులో పని చేస్తున్నాడు. రోజువారీ కూలీ చాలక నానా యాతన పడుతున్నాడు. నా ఈడు వాడే! వాడిది పెద్ద కుటుంబం కాబోలు. దానికితోడు పెద్దమ్మవారి తోడు కూడా ఉంది.

''అయ్యా, శీనయ్యా! ఒక్క షర్టు ఇప్పించండయ్యా'' అని ఏడాది నుంచీ అడుగుతున్నాడు. నా షర్టుకేసి చూసుకొని తోటివాళ్ళతో పోల్చుకొని బాధపడిన నేను వాడి షర్టుకేసి ఏనాడూ చూడలేదు. అవును, పాపం! వెర్రినాగన్న. చీలికలు వాలికలైన వాడి షర్టు చూస్తుంటే కడుపులో దేవినట్టయింది. వాడికో షర్టు కొని పెట్టాల్సిందే! ఏమైనా సరే కొనిపెట్టాల్సిందే. ఆ షర్టు వేసుకున్నప్పుడు వాడు అనుభవించే బ్రహ్మానందాన్ని చూసి నేను మహదానందపడిపోవాలి. దానం చెయ్యటంలో ఎంత గొప్ప సంతృప్తి ఉంది ఆ ఆలోచనే ఇంత తృప్తినిస్తుంటే కార్యరూపం దాలిస్తే ఇంకెంత తృప్తి ఉంటుందో!

పక్క సీటులో కూర్చునే గోపాలు నాకు మంచి మిత్రుడు. వాడితో చెప్పేశాను. సంతోషిస్తాడనుకున్నా. నా గొప్ప మనసుకు బ్రహ్మరథం పడతాడనుకున్నా. ఆఫీసులో నలుగురికి నా గురించి గొప్పగా చెబుతాడనుకున్నా. లేదు. తిట్టాడు.

''శ్రీనూ! నీకేం మతి పోయిందా! పోచిగాడికి కొత్త షర్టు కొనివ్వటు

వేపిమ్రా? నీ మొహం—ఏదో పాత షర్టు పడేయ్. ఏం ప్రమోషన్లు వరించేసి గొప్ప ఆఫీసరువైపోయావని ఈ దాన ధర్మాలు! తనకి మాలిన ధర్మం మొదలు చెడ్డ బేరంరా! నీ చెల్లెలి, తమ్ముడికి కొనిపెట్టు. వాళ్ళు సంతోషిస్తారు. ఇచ్చేవా ళ్ళున్నాళ్ళు చెయ్యి చాచేవా ళ్ళుంటారు. పిచ్చి ఆలోచనలు మానుకో! పోనీ నువ్వో షర్టు కొనుక్కో, నా మాట విను.''

నాకు భగ్గున మండుకొచ్చింది. ఏ మంచి పని ఎవరు చెయ్యబోయినా ఒక సైంధవుడు అడ్డుపడుతూనే ఉంటాడు. ఇదేం వక్ర భాష్యమో! అలా నా నిగ్రహించుకున్నాను.

''లేదురా, గోపాల్! అలా అనకు. ఎప్పుడూ అందరూ తొడిగి పారేసిన బట్టలే కట్టాలని వాళ్ళ మొహాన రాసి ఉందా ఏమిటి? నా చెల్లెళ్ళకి, తమ్ముడికి అడపాదడపా కొనకుండానే ఉన్నానా? వాళ్ళకీ కొంటాలే. వీడికి తియ్యటి షాక్ ఇయ్యాలి. వాడి మొహంలో వెలిగే హాస రేఖలు చూడాలి. తృప్తిని కొలవాలి. కాదనకురా. జీవితంలో ఎప్పుడూ ఎవరికీ దానం చెయ్యలేదు. ఎప్పుడూ మా ఇంటి గోల తప్పితే సంఘంలో తోటి జీవిని గురించి ఎప్పుడూ తలచనైనా లేదు. ఇప్పుడు శక్తి ఉందని కాదు. కాని ఏదో ఉన్న దాంట్లోనే. నువ్వు, నేను, పోచిగాడు ముగ్గురం పోదాం. వాడి కిష్టమైంది నా రేంజిలో కొని పెడతాను.''

''ఎవడి పిచ్చి వాడి కానందం. సరే పద.'' ముగ్గురం వెళ్ళాము. చాలా షర్టులు చూశాము. రంగు నచ్చితే ప్రింటు నచ్చదు. ప్రింటు రంగు వాడికి నచ్చితే నా పర్సు పర్మిట్ చెయ్యదు.


చివరికి ఎలాగోలా ఒక షర్టు ఎన్నుకున్నాడు. వాడికి రంగు ప్రింటు నచ్చాయి. నాకు ధర నచ్చింది. వాడి అభిరుచికి నాకు నవ్వు వచ్చింది. ఒకే వయస్సు వాళ్ళమైనా వాడి అభిరుచికి నా అభిరుచి 'పూర్తిగా భిన్నం. సన్న తీగకి వో మాదిరి సైజు ఆకులు. లేత పసుపు మీద ఎర్ర ప్రింటు. కొట్టొచ్చినట్టు కనబడుతూంది. గోపాల్‌కి కూడా వాడి ఎంపిక నచ్చలేదని అతని మొహమే చెబుతూంది. ఒక్కటే శాంపిల్ పీస్ వచ్చిందని కొట్టువాడు చెప్పాడు ''ఈ ఇంతోటి షర్టుకి యాభై రూపాయలా. ఆ నోటుకి నిప్పంటించి నంత బాధ కలుగుతూంది.'' గోపాల్ ఇంగ్లీషులో గొణిగాడు. నేను పట్టించుకో లేదు. పోచిగాడి మొహంలో నే నాశించిన దానికంటే ఎక్కువ సంతోషం, తృప్తి కనిపించాయి. ఎంతో తృప్తితో ఇంటి కెళ్ళాను.

అమ్మని చూడగానే తొందరపడ్డా నేమో అని కొంచెం గిల్టీ ఫీలయ్యాను. మళ్ళీ అంతలోకి సర్దుకున్నాను. నే నుండగా వీళ్ళకేం లోటు రానివ్వను కదా అని సరిపెట్టుకున్నాను.

మర్నాడు పోచిగాడు కొత్త షర్టు, చిరుగుల పాంటు వేసుకొచ్చాడు. కృతజ్ఞతతో నాకు దండం పెట్టాడు. చాలా ఆనందం కలిగింది. ఆ మర్నాడు మళ్ళీ పాత చీలికల షర్టు వేసుకొచ్చాడు. నేనేం మాట్లాడలేదు.

''ఏం పోచయ్యా కొత్త షర్టు వేసుకోలేదేం?'' గోపాల్ అడిగాడు.

''పండగలకు, పెండ్లిళ్లకు వేస్కుం టావయ్యా! రోజూ వేస్కుంటే పాడవుద్ది'' అన్నాడు. నిజమే ననిపించింది.




కాస్సే పాగి మళ్ళీ అన్నాడు—

''ఈ చింకి పేలికలు కట్టుకుంటే ఇంకో అయ్యకు దయ పుట్టి సరులు ఇస్తడు. కొత్తదేస్కొని తిరిగితె పోశిగాడు మంచిగున్నడు. శంద్రిగాడి కిద్దమను కుంటరు. ఎవరు పేదగ కనబడితె వాళ్లకిస్తరు.'' మనుషుల మనస్తత్వాన్ని బాగా గ్రహించాడు.

''వోరి దిప్పకాయ్! ఎంత తెలివి మీరి పోయావురా!'' గోపాల్ ఆశ్చర్య పోయాడు.

''ఒరే శ్రీనూ! చూశావా ముష్టివాళ్ళ ముఖ్య సూత్రం కూడా ఇదే! వాళ్ళు దరిద్రం చూపితే కదా ఎవరన్నా కనికరించి అయిదో పదో పైసలు వేసేది? మొత్తానికి పోచిగాడు గట్టి పిండమే.''

మర్నాడు గోపాల్ ఆఫీసు కొచ్చాడు. రోజులాగా లేడు. ముభావంగా ఉన్నాడు. లంచ్ దగ్గరా మాట్లాడలేదు. కాంటీన్‌లో టీ తాగుతున్నప్పుడూ మాట్లాడలేదు. వాడిలో ఈ మార్పుకు కారణం ఏమిటో బోధపడలేదు. ''ఎందుకురా అట్లా ఉన్నావు'' అని ఒకటి రెండుసార్లు అడిగాను. జవాబు లేదు. గట్టిగా అడిగితే ఏం లేదన్నాడు. అయిదయింది. ఆఫీసు డ్యూటీ అయింది.

''నాతో రారా శ్రీనూ! కాస్త స్టేషన్ దగ్గర పని ఉంది'' అన్నాడు.

'ఏమయ్యుంటుందీ! సరే! తినబోతూ రుచి అడగటం ఎందు'కని మవునంగా అనుసరించాను. రోడ్డు ప్రక్క పేవ్‌మెంట్ మీద రెడీమేడ్ బట్టలమ్మేవాడి దగ్గర ఆగాడు.

అబ్బాయ్! నిన్న అడ్వాన్సు ఇచ్చి పాక్ చేయించిన షర్టు ఇయ్యి. నిన్న పది రూపాయలిచ్చాను కదా! ఇవిగో పది హేను. మొత్తం ఇరవై అయిదు. సరిపోయిందా లెక్క'' అన్నాడు. పాకెట్ చింపి చూపించాడు.

ఆశ్చర్యం! నేను పోచిగాడికి కొనిచ్చిన షర్టే.

'ఇదేమిట్రా' అన్నట్టున్నాను. కాని గొంతు వణికి, మాట తొట్రుపోయి అది ఏమిటో తెలుగు నిఘంటువులో లేని వింత మాటగా బయటకు వచ్చింది.

''ఇంకా అర్థం కాలా! నీకు మతిపోయి పోచిగాడి కిచ్చిన బహుమతిని అమ్మి ఆ వచ్చిన డబ్బుని వాడు తాగుడుకు ఖర్చు పెట్టాడు.'' షర్టు విప్పి చూశా! అనురాగ్ క్లాత్ స్టోర్సే— అనుమానం లేదు. అదే రంగు, అదే ప్రింటు, అదే షర్టు. పైగా ఒకటే పీస్ శాంపిల్‌గా వచ్చిందని చెప్పాడు. నా మొహం మాడి పోయింది.

''ఇంక నువ్వు మతి పోగొట్టుకోకుండ ఉండేందుకు హెచ్చరికగా నువ్వు వాడికి బహుమతిగా ఇచ్చిన షర్టుని నేను నీకు బహుమతిగా ఇస్తున్నాను. నువ్వు నాకేం డబ్బివ్వక్కర్లేదు. కానీ ఇది ఇంకెవ్వరికీ ఇవ్వకు. ఈ అనుభవానికి గుర్తుగా ఉండిపోనీ! జరిగిందేమిటో ఇంకా విశదంగా చెప్పాలంటే నువ్వు దీన్ని యాభైకి కొన్నావు. వాడు ఇరవైకి అమ్మాడు. నేను పాతికకి కొన్నాను. బోధ పడిందా?'' షర్టు పాక్ నా చేతిలో కుక్కాడు. నాకెందుకో సమర్థించుకోవాలనిపించింది.

''వాడికేం కష్టమొచ్చిందో లేకపోతే బహుమతి షర్టు ఎవడైనా అమ్ము కుంటాడా!'' జాలి పడ్డాను.

పోచిగాడింటి కెళ్ళాం. తప్ప తాగి నోటికొచ్చినట్టు పేలుతున్నాడు. పెళ్ళాన్ని చితక్కొడుతున్నాడు.

మనస్సు వికలమైంది. ఏం చేద్దా మనుకున్నాను? ఏం జరిగింది? ఇంటి కెళ్ళాను. జరిగినదంతా చెల్లాయికి చెప్పాను. ఇన్నాళ్ళూ పేదరికాన్నే అసహ్యించుకున్నాను. ఇప్పుడు వాళ్ళంటే కూడా అసహ్యం పుడుతూంది లచ్చా! ఎందుకంటే వాళ్ళు పేదరికానికి దూరంగా ఉండదలుచుకోరు కనక.'' ఆవేశంగా అన్నాను.

''లేదు అన్నయ్యా! నువ్వు పొరబడు తున్నావు. మనిషన్న ప్రతివాడూ ఏదో తప్పు చేస్తాడు. గొప్పవాళ్ళు చేసే తప్పులు డబ్బుతో కప్పబడిపోతాయి. పేదవాడు చేసే తప్పు పదింతలై కనబడుతుంది. వాడి తప్పు వాడికి తెలియచెప్పు. వాడు పశ్చాత్తాపపడేలా చెయ్యి. చెడు మార్గాన పోతున్నవాణ్ణి మంచి మార్గంలోకి లాక్కురా! ప్రభుత్వం ఇచ్చిన రిక్షాలను, కాడి ఎద్దులను, భూమిని అమ్ముకొని తాగేసిన వాళ్ళున్నారు. నిజమే. వింటే అసహ్యం పుడుతుంది. కాని మనం ఉద్ధరించా ల్సింది వాళ్ళనే అన్నయ్యా! మినుకు మినుకు మంటున్న వాళ్ళ జీవితాలు గాఢాంధకారంలోకి దిగజారుతున్నప్పుడు చేయూతనిచ్చి మనస్సు మార్చి వాళ్ళని వెలుగులోకి తేవటమే మన కర్తవ్యం. బాగున్నవాళ్ళని మనం బాగుపరచక్కర్లేదు. చెడిపోయినవాళ్ళనే మనం బాగుపరచాలి. వెళ్ళు! వెళ్ళి వాడి కీ షర్టు రెండో మాటు బహుమతిగా ఇయ్యి! అప్పుడు సిగ్గుతో కుంగిపోతూ పశ్చాత్తాపపడే పోచిగాడి మొహం చూడు! నీ చూపుల్ని తప్పించుకొనే వాడి చూపుల్ని చూడు. బీ ఆప్టిమిస్టిక్! వాణ్ణి మార్చ గలిగితే నీకు కలిగే తృప్తిని వూహించుకో.''

లీడర్ వచ్చి పట్టుకెడతానన్న బోర్డు పూర్తి చేశాను. ''భరతమాత కన్నీరు తుడవటం కష్టం కాదు.'' షర్టు తీసుకొని పోచిగాడింటికి బయలుదేరాను.

★